క్లుప్తంగా

నిత్యావసరాలు పంపిణీ



గుంటూరు మెడికల్: పేదలకు బీజేపీ ఆధ్వర్యంలో నిత్యావసరాలను బుధవారం పంపిణీ చేశారు. దేశవ్యాప్తంగా అంబేడ్కర్ జయంతి వేడుకల్లో భాగంగా ఆ పార్టీ గుంటూరు జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు డాక్టర్ దారా అంబేడ్కర్ ఆధ్వర్యంలో గుంటూరు అరండల్‌పేటలో పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ చేశారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, ఈదర శ్రీనివాసరెడ్డి, బజరంగ్ రామకృష్ణ, మంత్రి సుగుణ, వక్కలగడ్డ తిరుమలరావు, పెద్దింటి కృష్ణచైతన్య, బూసి స్టాలిన్, ఎం.అశోక్, మోతే శేషగిరిరావు, రమాదేవి పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితో ఉద్యోగావకాశాలు



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ కొలువులను సాధించేందుకు ఎదురు చూస్తున్న అభ్యర్థులు ఏకాగ్రత, పట్టుదలతో మెగా డీఎస్సీకి సన్నద్ధం కావాలని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని ఆదిత్య కాంపిటీషన్స్ ఆధ్వర్యంలో 2025 మెగా డీఎస్సీ అభ్యర్థులకు బుధవారం శ్రీ మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో ఉచిత అవగాహన సదస్సు నిర్వహించారు. తొలుత టెట్, డీఎస్సీ స్టడీ మెటీరియల్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 16,467 మందితో పాటు స్పెషల్ టీచర్స్ 2500 పోస్టులకు నోటిఫికేషన్ త్వరలో రానున్నదన్నారు. ఆదిత్య కాంపిటీషన్స్ డైరెక్టర్ కె.ప్రణయ్ కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో శ్రీ మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మంచాల బోసు బాబు, తన్నీరు రాజ్యలక్ష్మి, అజయ్, ప్రభంజన్ పాల్గొన్నారు.

ఈడీ కేసులతో భయపెట్టలేరు..



లక్ష్మీపురం: స్థానిక కన్నవారితోటలోని సెంట్రల్ జీఎస్టీ కార్యాలయం ఎదుట జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సోనియా, రాహుల్ గాంధీలను ఈడీ విచారణకు హాజరు కావాలని కోరడాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలకా విజయ్, ప్రధాన కార్యదర్శి బిళ్ళా సునీల్, గద్దం పాల్ విజయకుమార్, మదన్ మోహన్ రెడ్డి, రాచకొండ జాన్‌బాబు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం దహనం



పట్నంబజారు: ద్విచక్రవాహనం తగలబెట్టిన ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాలు.. రామిరెడ్డితోటకు చెందిన ఆర్.జస్విక్టర్ ప్రైవేటు ఆస్పత్రిలో పనిచేస్తుంటాడు. మంగళవారం రాత్రి ఇంటి ముందు నిలిపిన ద్విచక్రవాహనం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించి తగులబెట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్ జిల్లా బదిలీలు చేపట్టాలి

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రంలోని జెడ్పీ, మున్సిపల్ పాఠశాలల్లో వివిధ కేడర్లలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు అంతర్ జిల్లా బదిలీలు చేపట్టాలని పాఠశాల విద్యాశాఖ జేడీ సర్వీసెస్ పి.పార్వతికి విజ్ఞప్తి చేసినట్లు నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండూరు శ్రీనివాసరాజు, బొనిగల హైమారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు మంగళగిరిలోని కార్యాలయంలో వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. వేర్వేరు జిల్లాల్లో పని చేస్తూ, కొన్నేళ్లుగా కుటుంబాలకు దూరంగా ఉంటున్న ఉపాధ్యాయులకు తక్షణమే బదిలీలు నిర్వహించాలని కోరారు. స్పౌజ్ కేటగిరీలో ఉన్న ఉపాధ్యాయులు తమ పిల్లలకు సైతం దూరంగా ఉంటూ విధులు నిర్వహిస్తున్న దృష్ట్యా, బదిలీలు చేపట్టాలని కోరారు. మోడల్ స్కూళ్లలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు వేసవి సెలవుల్లో బదిలీలు చేపట్టాలని కోరారు.

వాహనాల తనిఖీలు

లక్ష్మీపురం: ఎస్‌డీపీఓ కె.అరవింద్ ఆధ్వర్యంలో పట్టాభిపురం, నగరంపాలెం సీఐలు బుధవారం సాయంత్రం టీజేపీఎస్ కాలేజీ వద్ద ప్రత్యేకంగా పోలీసు సిబ్బంది వాహన తనిఖీలు నిర్వహించారు. వాహన ధ్రువపత్రాల పరిశీలన, నిబంధనలు పాటించకపోవడం, అనుమానాస్పద వ్యక్తులపై నిఘా పెట్టడం లక్ష్యంగా ఈ తనిఖీలు నిర్వహించారు.

ఎస్సీలకు రుణబంధనాలు

- ఎవరికి ఉపయోగపడని కార్పొరేషన్ లోన్లు
- జిల్లాలో 990 యూనిట్ల గాను 43 కోట్లు లబ్ధి చేకూర్చేందుకు చర్యలు
- లోన్లు పెట్టుకునేందుకు విద్యార్హతలు తప్పనిసరి చేసిన వైనం



ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం

నెహ్రూనగర్: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాల పేరుతో ప్రభుత్వం మోసం చేస్తోంది. యూనిట్ల విషయంలో అందుబాటులో లేకుండా పోయాయి. లోన్లు మంజూరు చేసి కేవలం తమ అనుకునే వారికి మాత్రమే లబ్ధి చేకూర్చే విధంగా లోన్లను ప్రభుత్వ పెద్దలను డిజైన్ చేశారంటూ పలువురు కూటమి ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు.

మూడు కేటగిరిలలో యూనిట్లు..

కేటగిరి– 1 కింద ఫ్లవర్ బోటిక్ డెకరేషన్, వర్మీ కంపోస్ట్, వెబ్‌సైట్ డెవలప్‌మెట్, ఎల్ఈడీ బల్బ్స్, ప్లంబింగ్, ఎలక్ట్రీషియన్ సర్వీస్, వాటర్ బాటిల్ రీఫిల్ సర్వీస్, వాటర్ రీసైక్లింగ్.

కేటగిరి– 2 కింద మొబైల్ రీపేరింగ్, సోప్ తయారీ, ఫిష్ ఫార్మింగ్, టూరింగ్, మొబైల్ కార్ వాష్, బేకరి, బ్రిక్ ప్రొడక్షన్, సెరీ కల్చర్, ఆర్వో ప్లాంట్, వెల్డింగ్, జూట్ బ్యాగ్, సోలార్ ఎనర్జీ, కాయర్ ప్రొడక్ట్ తయారీ, ఫొటోగ్రాఫీ, వీడియోగ్రాఫీ, ఆయుర్వేదిక్ క్లినిక్, హెర్బల్ మెడిసిన్ స్టోర్, జనరిక్ మెడికల్ షాప్, బ్యూటీ పార్లర్, మెడికల్ ల్యాబ్.

కేటగిరి– 3 కింద ఈవీ బ్యాటరీ చార్జింగ్ యూనిట్.

ఎస్సీలకు తీవ్ర అన్యాయం

గతంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇచ్చే సబ్సిడీ రుణాల్లో ఫ్యాన్సీ స్టోర్, కిరాణా, ఇంటర్నెట్, టెంట్ హౌస్, లబ్ధిదారుడికి ఇష్టమైన యూనిట్ స్థాపించేందుకు అవకాశం ఉండేది. యూనిట్లు స్థాపనకు వయస్సు గతంలో 21 నుంచి 60 సంవత్సరాల వరకు ఉండేది. ప్రస్తుతం 50 సంవత్సరాలకే కుదించారు. ఏ యూనిట్ స్థాపించాలన్నా కూడా విద్యార్హతల సర్టిఫికెట్ అప్లోడ్ చేయాల్సిన పరిస్థితి. గతంలో రూ.25 లక్షల వరకు యూనిట్లు స్థాపించేందుకు అవకాశం కల్పించారు. కాని ఇప్పుడు తక్కువ మొత్తానికి పరిమితం చేశారు. గతంలో ఇన్నోవా కార్లు ఇచ్చేవారు.. ఈ సారి చిన్న కార్లకు పరిమితం చేశారు.

జిల్లాకు కేవలం 990 యూనిట్లు మాత్రమే

గతంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో 4వేల యూనిట్లు పెట్టుకునేందుకు అవకాశం కల్పించింది. వచ్చే నెల 10వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కాని గుంటూరు జిల్లాకు రూ.990 యూనిట్లు, పల్నాడు జిల్లాకు రూ.992 యూనిట్లు మాత్రమే మంజూరు చేసి చేతులు దూలుపుకుంది. అందులో గుంటూరు జిల్లాకు సంబంధించి సబ్సిడీ రూ.16.33 కోట్లు కాగా, బ్యాంక్ లోన్ రూ.22.93 కోట్లు, లబ్ధిదారుని వాటా కింద రూ.2.66 కోట్లతో కలిసి మొత్తం జిల్లాకు 41.33కోట్లు మాత్రమే మంజూరయ్యాయి. అదే విధంగా పల్నాడు జిల్లాలో 38.56 కోట్లు మాత్రమే మంజూరు అయ్యాయి.

సబ్సిడీ లోన్లు పేరుతో మోసం



ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇచ్చే సబ్సిడీ రుణాలు దళితుల సంక్షేమాన్ని నిర్వీర్యం చేస్తుంది. పేరుకే రుణాలు మంజూరు ప్రకటనలు చేసి ప్రగాల్భాలు పలికిన రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పథకాలలో దళితులకు ఉపయోగపడే ఒక్క పథకం లేదు. గతంలో ఫ్యాన్సీ స్టోర్, కిరాణా, ఇంటర్నెట్, ఇతర యూనిట్లు స్థాపించేందుకు అవకాశం ఉంది. ప్రస్తుతం దళితులు ఎవరూ పెట్టలేని యూనిట్లు ఏర్పాటు చేసి దళితులను మోసం చేస్తున్నారు.

– గోళ్ల అరుణ్‌కుమార్, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు

దళితులు ఏం పాపం చేశారని



ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇచ్చే 27 అంశాలు ఉపయోగపడే విధంగా లేవు. మాదిగలకు లెదర్ యూనిట్లుకు సంబంధించి లేకపోవడం దారుణం. 2018లో చంద్రబాబునాయుడు ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రూ.2173 కోట్లుగా ఉంటే 2019లో రూ.2450 కోట్లకు పెంచారు. కాని ప్రస్తుతం కేవలం రూ.340కోట్లు మాత్రమే మంజూరు చేసి దళితులను తీవ్ర అన్యాయం చేశారు. వయోపరిమితిని తగ్గించడం అన్యాయం.

– పరిశపోగు శ్రీనివాసరావు, నవ్యాంధ్ర ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షులు

వ్యర్థాలను రోడ్లపై వేస్తే చర్యలు

కమిషనర్ పులి శ్రీనివాసులు



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని అపార్ట్‌మెంట్స్, కమ్యూనిటీ గృహ సముదాయాల వారు తమ ఇళ్లల్లో వచ్చే వ్యర్థాలను రోడ్ల మీద, ఖాళీ స్థలాల్లో వేయరాదని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. బుధవారం పట్టాభిపురం, రవీంద్ర నగర్, శ్యామలా నగర్, కృష్ణ నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. శ్యామల నగర్ 3వ లైన్‌లోని ఓ అపార్ట్‌మెంట్ వాచ్ మెన్ వ్యర్థాలను పక్కన ఖాళీ స్థలంలో వేయడం గమనించారు.. అపార్ట్‌మెంట్ కమిటీ సభ్యులతో మాట్లాడుతూ వ్యర్థాలను పక్కన ఉండే ఖాళీ స్థలాల్లో వేయడం వలన చుట్టుపక్కల ఉండే నివాసితులకు ఇబ్బందిగా ఉంటుందని చెప్పారు. ప్రతి అపార్ట్‌మెంట్‌లో తగిన డస్ట్ బిన్లు ఏర్పాటు చేసుకోవాలని, కంపోస్ట్ ఎరువు తయారీకి ముందుకు రావాలని కోరారు. కంపోస్ట్ ఎరువు తయారీ కోసం నగరపాలక సంస్థ తగిన అవగాహన కల్పిస్తామన్నారు. ప్రజారోగ్య కార్మికులు కొన్ని ప్రాంతాల్లో ఖాళీ స్థలాల్లో సేకరించిన చెత్త వేయకుండా ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. డివిజన్ల వారీగా అదనపు కార్మికులతో పాటు వాహనాలు ఇస్తున్నామని, వాటి ద్వారా చెత్త కుప్పలను డంపింగ్ యార్డుకి తరలించాలని వివరించారు. కృష్ణ నగర్ పార్క్‌ని పరిశీలించి, పార్క్‌లో వాకింగ్ ట్రాక్ మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ఓపెన్ జిమ్ ఎక్విప్‌మెంట్‌ని సదరు కాంట్రాక్టర్‌తో రిపేర్ చేయించాలని డీఈఈని ఆదేశించారు. పర్యటనలో డీఈఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముందస్తు పన్ను చెల్లింపుపై 5 శాతం రాయితీ

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025–26) సంబంధించిన ఆస్తి పన్నును ముందస్తుగా ఏప్రిల్ నెలాఖరులోగా ఏక మొత్తంగా చెల్లించే వారికి మొత్తం పన్నుపై 5 శాతం రాయితీ లభిస్తుందని, ప్రజలు రాయితీని సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. బుధవారం ఒమేగా హాస్పిటల్స్, ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కాలేజీలు ముందస్తు పన్ను చెల్లిస్తూ కమిషనర్‌కు చెక్కులను అందించారు. ఒమేగా హాస్పిటల్స్ రూ.15,12,784, ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కాలేజీ రూ.16 లక్షల ముందస్తు పన్ను చెల్లింపు చెక్కులను అందించారన్నారు.

మర్యాదపూర్వక కలయిక



అంబటికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాలరావు



అంబటిని సత్కరిస్తున్న యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉత్తేజ్‌రెడ్డి

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబును బుధవారం పార్టీ అనుబంధ విభాగాల నూతన అధ్యక్షుడిగా నియమితులైన పలువురు సిద్ధార్థనగర్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల ఉత్తేజ్‌రెడ్డి, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు తాడిబోయిన వేణుగోపాలరావు అంబటిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన్ను దుశ్శాలువలతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.

నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా..

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమాను బుధవారం యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఆళ్ల ఉత్తేజ్‌రెడ్డి మంగళదాస్‌నగర్‌లోని ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఆమెను దుశ్శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు.



ఉత్తేజ్‌రెడ్డిని సత్కరిస్తున్న నూరిఫాతిమా

వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పరిశీలన



వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న వైద్య విద్యార్థులు

గుంటూరు మెడికల్: తక్కెళపాడు వద్ద ఉన్న వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను వైద్య విద్యార్థులు బుధవారం సందర్శించారు. ఎంఎన్‌సీ నిబంధనల ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన ప్రాక్టికల్ వైద్య విద్య ఇవ్వాలన్న ఉద్దేశంతో గుంటూరు మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వి.సుందరాచారి ఆదేశాల మేరకు గుంటూరు మునిసిపల్ కమిషనర్ సహకారంతో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వైద్య విద్యార్థులు పరిశీలించారు. నాలుగేళ్ల విరామం తరువాత ప్రిన్సిపాల్ ప్రత్యేక ఆలోచనతో ఈ ఫీల్డ్ విజిట్ ఏర్పాటు చేశారు. డాక్టర్ సుందరాచారి విజ్ఞప్తి మేరకు పూర్వ వైద్య విద్యార్థులు 1999 బ్యాచ్‌కు చెందిన పలువురు వైద్యులు రెండు కొత్త బస్సులు కాలేజీకి విరాళంగా అందించారు. నూతన బస్సులు అందుబాటులో ఉండటంతో ఫీల్డ్ విజిట్ కు ఎలాంటి ఇబ్బంది లేకుండా వైద్య విద్యార్థులు వెళ్లారు. వాటర్ సెడిమెంటేషన్, రాపిడ్ సాండ్ ఫిల్టర్, క్లోరినేషన్ వంటి ప్రక్రియలను విద్యార్థులు ప్రత్యక్షంగా చూశారు. వాటర్ ప్లాంట్ సిబ్బంది వాటిని చూపించగా, విద్యార్థులు ఆసక్తిగా గమనిస్తూ నోట్స్ తయారు చేసుకున్నారు. వాటర్ ప్లాంట్ సందర్శన విద్యార్థులకు పాఠశాల పుస్తకాల కతీతంగా ప్రాక్టికల్ అవగాహన కల్పించింది.

మే 20న జాతీయ కార్మిక సంఘాల సమ్మె



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

లక్ష్మీపురం: లేబర్ కోడ్‌ను వ్యతిరేకిస్తూ మే 20వ తేదీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమ్మె నిర్వహించనున్నట్లు సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రమాదేవి తెలిపారు. పాతగుంటూరులోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో బుధవారం బి.లక్ష్మణరావు అధ్యక్షతన సంఘ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలకు దోచి పెట్టేందుకు లేబర్ కోడ్లను మారుస్తూ కేంద్రం కార్పొరేట్ సేవలో ఉందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రతి కార్మికుడి వద్దకు మే 20వ తేదీ సార్వత్రిక డిమాండ్లను తీసుకెళ్లాలని కోరారు. సమావేశంలో జిల్లా కోశాధికారి ఎం.సాంబశివరావు, వి.దుర్గారావు, కె.బాబు ప్రసాద్, షేక్ హుస్సేన్ వలి, జిల్లా కార్యదర్శులు వై.నేతాజీ, వై.రమణ, ఎస్ఎస్ చెంగయ్య, సిహెచ్.నాగ బ్రహ్మాచారి, ఎం.భాగ్యరాజు, ఎన్.రమేష్ బాబు పాల్గొన్నారు.

పీవీఎన్ కృష్ణకు మల్లాది చంద్రశేఖరశాస్త్రి స్మారక పురస్కారం



కృష్ణకు మల్లాది చంద్రశేఖరశాస్త్రి స్మారక పురస్కారం అందిస్తున్న అతిథులు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై బుధవారం సాయంత్రం తెలుగు నాటక రంగ దినోత్సవం, మల్లాది చంద్రశేఖరశాస్త్రి శత జయంతి నిర్వహించారు. భగవాన్ శరణం కల్చరల్ అసోసియేషన్(హైదరాబాద్), శ్రీరామకృష్ణా నాట్య మండలి సంయుక్తంగా నిర్వహించగా, డాక్టర్ పిల్లుట్ల లక్ష్మీకాంతశర్మ అధ్యక్షత వహించారు. అనంతరం ప్రముఖ రంగస్థల నటుడు, దర్శకుడు డాక్టర్ పీవీఎన్ కృష్ణకు మల్లాది చంద్రశేఖరశాస్త్రి స్మారక పురస్కారంతో సత్కరించారు. కార్యక్రమంలో సినీ నటులు మల్లాది రాఘవరావు, ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, డాక్టర్ చింతలపాటి శూలపాణి, ఎం.సూర్యనారాయణ పాల్గొన్నారు. సభానంతరం ప్రదర్శించిన శ్రీకృష్ణ రాయబారం పౌరాణిక పద్య నాటకం ప్రేక్షకులను అలరించింది.

ముగిసిన నాటకోత్సవాలు



భూతకాలం నాటకంలో ఓ సన్నివేశం

నగరంపాలెం: స్థానిక కొరిటెపాడు ఎల్‌వీఆర్ అండ్ సన్స్ క్లబ్ రీడింగ్ రూమ్‌లోని వేదికపై డాక్టర్ మురళీమోహన్ 52 ఏళ్ల కళారంగ ప్రస్థానం, గుమ్మడి శ్రీమన్నారాయణ కళాసమితి, వైకే నాగేశ్వరరావు నాటక కళా పరిషత్ సంయుక్తంగా నిర్వహిస్తున్న నాటకోత్సవాలు బుధవారం ముగిశాయి. కళావిపంచి అధ్యక్షులు బొప్పన నరసింహారావు, గుమ్మడి శ్రీమన్నారాయణ కళాసమితి కన్వీనర్ కాట్రగడ్డ రామకృష్ణప్రసాద్, పిన్నమనేని మృత్యుంజయరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. తెలుగు నాటక రంగ దినోత్సవం సందర్భంగా ప్రముఖ రంగస్థల నటులు, జర్నలిస్ట్ ఫలతోటి జోసఫ్‌ను సత్కరించారు. అనంతరం మాడభూషి దివాకరబాబు రచించి డాక్టర్ గోవాడ వెంకట్ దర్శకత్వం వహించిన గోవాడ క్రియేషన్స్ (హైదరాబాద్)పై డాక్టర్ రాధ సగిలి నిర్వహణలో భూతకాలం నాటకం ప్రదర్శించారు. కార్యక్రమంలో జి.మల్లికార్జునరావు, డి.తిరుమలేశ్వరరావు, జానీబాషా పాల్గొన్నారు.

వాటర్ కూలర్ బహూకరణ

నగరంపాలెం: గుంటూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆర్.అగ్రహారం శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో వాటర్ కూలర్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి ఉత్సవాలను సీఎం చంద్రబాబు అధికారికంగా ప్రకటించారని అన్నారు. సంఘం ఆధ్వర్యంలో ప్రతినెల 16న సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. తొలుత పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కొనకళ్ల సత్యం, అధ్యక్ష, కార్యదర్శులు గుడివాడ రవీంద్రకుమార్, కోట శేషగిరిరావు, కోశాధికారి బొలిశెట్టి బాపారావు, కార్యక్రమ కమిటీ చైర్మన్ అద్దేపల్లి రాఘవేంద్రరావు, అమరా శ్రీనివాసరావు, కొత్తూరి వెంకట్, కార్పొరేటర్ సంకూరి శ్రీనివాసరావు, ఆలయ ఈఓ శ్రీనివాసరావు, రాయవరపు అశోక్, తల్లం శ్రీనివాసరావు,తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలల ప్రవేశాలకు చర్యలు తీసుకోవాలి

ఏఎన్‌యూ: రాష్ట్రంలో డిగ్రీ కళాశాలల ప్రవేశాల విషయంలో ప్రభుత్వం నిర్ణయాలను వేగంగా తీసుకోవాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్లవరపు పవన్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిగ్రీ స్థాయిలో మేజర్ల విధి విధానాలపై కమిటీ నివేదికని వెంటనే బహిరంగ పరచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే ఈ విషయాన్ని పరిశీలించి తగు నిర్ణయాన్ని తెలపాలన్నారు. ఇంజినీరింగ్ అడ్మిషన్లతో ముడిపెట్టకుండా, డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలన్నారు. జూలై మొదటి వారంలో మొదటి డిగ్రీ విద్యా సంవత్సరాన్ని ప్రారంభించాలని కోరారు.

నేడు కార్మికుల ప్రత్యేక గ్రీవెన్స్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో పని చేసే ప్రజారోగ్య, ఇంజినీరింగ్ కార్మికులు, ఉద్యోగులు తమ సమస్యలపై ఫిర్యాదులు, అర్జీలు అందించేందుకు గురువారం సాయంత్రం 3 నుంచి 4 గంటల వరకు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యలపై అర్జీలను గ్రీవెన్స్‌లో అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అన్నా క్యాంటీన్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రజారోగ్య అధికారులు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం పల్నాడు బస్టాండ్ వద్ద గల అన్నా క్యాంటీన్‌ని పరిశీలించారు.

రైలుపేటలో ఎమ్మెల్యేను అడ్డుకున్న స్థానికులు

నెహ్రూనగర్: తూర్పు నియోజకవర్గంలోని రైలుపేట 1వ లైనులో రోడ్లు, డ్రెయిన్‌ల నిర్మాణానికి రూ.38 లక్షలు మంజూరు అయ్యాయి. బుధవారం వాటి పనుల శంకుస్థాపన నిమిత్తం తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ రైలుపేటకు చేరుకున్నారు. శంకుస్థాపన చేస్తున్న క్రమంలో అక్కడి స్థానికులు ఎమ్మెల్యేను అడ్డుపడి ఇక్కడ శంకుస్థాపన చేయవద్దన్నారు. గతంలో ఇదే వీధిలో యూజీడీ పైపులైను వేశారని, దానిని సక్రమంగా చేయకపోవడంతో స్థానికులు కలిసి కొంత నగదు వేసుకుని పనులు పూర్తి చేసుకున్నామన్నారు. ఇప్పుడు అర్ధాంతరంగా యూజీడీ బ్లాక్ చేస్తూ దానిపై రోడ్డు వేయడం ఎంత వరకు కరెక్ట్ అని ఎమ్మెల్యేను నిలదీశారు. దీంతో ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. స్థానిక కూటమి నాయకులు స్థానికులతో మాట్లాడి ఒపించడంతో శుక్ర, శనివారాల్లో శంకుస్థాపనకు ఎమ్మెల్యే అంగీకరించినట్లు తెలిసింది.

వీధి వ్యాపారులను దోచేస్తున్నారు



అమౌంట్ లేకుండా రూ. 50 వసూలు చేసిన రశీదు

నెహ్రూనగర్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్ట్రీట్ వెండింగ్ పాలసీకి వ్యతిరేకంగా వీధి వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేస్తూ కూటమి నేతలు జేబులు నింపుకుంటున్నారు. గుంటూరు నగరపాలక సంస్థ కార్యాలయం ఎదురుగా ఉన్న పీవీకే నాయుడు మార్కెట్ ప్రాంగణం చుట్టూ సీజనల్‌గా వివిధ వ్యాపారాలు నిర్వహించుకునే వారి వద్ద కొంత మంది కాంట్రాక్టర్లు డబ్బులు వసూలు చేస్తుండంపై నగరపాలక సంస్థ అధికారులు నిర్లక్ష్యానికి అద్దం పడుతుంది. వీధి వ్యాపారుల వద్ద రుసుం వసూలు చేయకూడదని కౌన్సిల్‌లో తీర్మానం చేసిన ఫలితం లేకుండా పోయింది. పీవీకే నాయుడు మార్కెట్ వద్ద సుమారు వంద మందికి పైగా సీజనల్ వ్యాపారాలు నిర్వహిస్తుంటారు. దీన్నే అదునుగా చేసుకుని కొంత మంది కాంట్రాక్టర్లు పాలకులను అడ్డుపెట్టుకుని వారి రూ.50 చలనా ఇచ్చి మరి డబ్బులు వసూలు చేస్తున్నారు. కొంత మంది కట్టమని చెప్పినప్పటికి..డబ్బులు కడితేనే వ్యాపారం చేసుకునేందుకు అనుమతి ఇస్తామంటూ వారిని భయాభ్రాంతులకు గురి చేసి వారి వద్ద నుంచి డబ్బులు బలవంతంగా వసూలు చేస్తున్నారు.

రాష్ట్ర సాఫ్ట్ టెన్నిస్ పోటీల్లో జిల్లా జట్టుకు ప్రథమ స్థానం



పతకాలు సాధించిన క్రీడాకారులు

గుంటూరు వెస్ట్: రాష్ట్ర స్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీల్లో గుంటూరు జిల్లా బాలరు జట్టు ప్రథమ స్థానం, బాలికల జట్టు ద్వితీయ స్థానాలు సాధించినట్లు గుంటూరు జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి కడియం జయరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపినట్లు చెప్పారు. జట్టు సభ్యురాలు అంజు ప్రియ వచ్చే నెల 29 నుంచి పంజాబ్‌లోని మొహాలిలో నిర్వహించనున్న జాతీయ పోటీలకు ఎంపికయ్యిందని చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించండి

స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ చంద్రముని



వేజండ్లలో విద్యార్థి ప్రవేశ దరఖాస్తు స్వీకరిస్తున్న ఎంఈఓ సుబ్బారావు

వేజండ్ల(చేబ్రోలు): చిన్నారులను, విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ చంద్రముని అన్నారు. చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామంలో బుధవారం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశం కొరకు ర్యాలీ నిర్వహించారు. వేజండ్లలో జరిగిన ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ చంద్రముని, ఎంఈఓ రాయల సుబ్బారావు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరుగుతున్నదని తెలిపారు. ఐదుగురు విద్యార్థులు నూతనంగా ప్రవేశ దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం టి.విజయశ్రీ, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పి.శ్రీనివాసమూర్తి, లక్ష్మీ పద్మావతి, పి.దీప్తి, వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం!

పట్నంబజారు: ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాలు.. కొత్తపేటకు చెందిన వైద్యుడు ఓ ప్రైవేటు ఆస్పత్రిలో అసిస్టెంట్ డాక్టర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి ఆరిమండ తేజ కృష్ణకమల్ అనేవ్యక్తి పరిచయమయ్యాడు. డిగ్రీ పూర్తి చేసిన వారు ఎవరైనా ఉంటే కోర్టులో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు. సదరు డాక్టర్ పలువురి వద్ద నుంచి రూ.13 లక్షలు కట్టించాడు. మోసపోయామని గ్రహించిన డాక్టర్ భార్య ఎస్.శ్వేత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

పట్నంబజారు: మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాలు.. నల్లచెరువుకు చెందిన పి.నాగరాజు(28), మురళితో వివాదం జరిగింది. అయితే ఈనెల 15న రాత్రి అందరూ కలిసి మద్యం తాగిన క్రమంలో మురళి తనను ఏమీ చేయలేకపోయావంటూ నాగరాజును హేళన చేశాడు. దీంతో మనస్తాపానికి గురైన నాగరాజు మంగళవారం రాత్రి ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.